క్లుప్తంగా

3న నిరసన

కడప వైఎస్సార్ సర్కిల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ రైతాంగాన్ని, కార్మిక వర్గాన్ని, నిరుద్యోగులను విస్మరించిన బడ్జెట్ అని, దీనిని నిరసిస్తూ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 3న జిల్లా వ్యాప్తంగా తహసీల్దార్ కార్యాలయాల ఎదుట నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు రైతు, కార్మిక, వ్యవసాయ కార్మిక సంఘాల జిల్లా ప్రధాన కార్యదర్శులు మనోహర్, దస్తగిరి రెడ్డి, అన్వేష్ తెలిపారు. శనివారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఈ మేరకు పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలకు ఈ బడ్జెట్ లో నిధులు కేటాయించకపోవడం చాలా అన్యాయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నగర అధ్యక్షులు విజయకుమార్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఏ రామ్మోహన్, కార్మిక సంఘం నాయకులు నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పార్టీని బలోపేతం చేయాలి

కడప వైఎస్సార్ సర్కిల్: కాంగ్రెస్ పార్టీని బలపరిచే విధంగా పని చేయాలని డీసీసీ అధ్యక్షురాలు ఎన్డీ విజయజ్యోతి, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ రాష్ట్ర అధ్యక్షుడు దాదా గాంధీ పేర్కొన్నారు. శనివారం నగరంలోని ఇందిరాభవన్‌లో జిల్లా కాంగ్రెస్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ పార్టీలో నియామకాలు పొందిన వారందరూ పార్టీలో నిబద్ధతగా ఉండి కష్టపడి పని చేసి పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు. జిల్లాలోని మండలాల అధ్యక్షుల, మైనారిటీ శాఖ నాయకుల నియామకాలను ప్రకటించారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షుడు అఫ్జల్ ఖాన్, కాంగ్రెస్ పార్టీకి చెందిన అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల కో ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

సమగ్ర విచారణ జరపాలి

కడప వైఎస్సార్ సర్కిల్: నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ అధికారులు చేపట్టిన పనులపై సమగ్ర విచారణ చేయాలని ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కెసి.బాదుల్లా డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని హోచిమిన్ భవన్‌లో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగంలో గత పది సంవత్సరాలుగా వివిధ స్థాయిలలో పనిచేస్తున్న అధికారి అవినీతి జాడలు కనిపిస్తున్నాయని సీసీ రోడ్లు వేసిన 15రోజులకే దుమ్ము లేస్తున్నాయన్నారు. మురుగునీటి కాలువల్లో రాళ్లు బయటపడుతున్నాయన్నారు. ఇంజనీరింగ్ విభాగం కోట్ల రూపాయల నిధుల దుర్వినియోగానికి కారణమైందని ఆరోపించారు.

అర్హులందరికీ పింఛన్లు

కడప కార్పొరేషన్: అర్హులందరికీ పింఛన్లు అందేలా చర్యలు తీసుకోవాలని నగరపాలక కమిషనర్ మనోజ్‌రెడ్డి ఆదేశించారు. శనివారం ఆయన మార్నింగ్ విజిట్‌లో భాగంగా రాజారెడ్డి వీధి, శంకరాపురం, అల్మాస్‌పేట ప్రాంతాలను పరిశీలించారు. సాయిపేట శ్మశాన వాటికను సందర్శించి శ్మశానానికి వెళ్లే మార్గంలో రోడ్డు ఏర్పాటు కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. బ్రాహ్మణ వీధిలో పింఛన్ల పంపిణీ ప్రక్రియను స్వయంగా పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పింఛన్లు అందజేయాలన్నారు. జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉన్న అన్న క్యాంటీన్‌ను సందర్శించి శుభ్రతపై సమీక్ష నిర్వహించారు. మరుగుదొడ్లు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

– కడప నగరంలోని నాగరాజుపేటలో జరుగుతున్న పీ–4 సర్వే, వర్క్ ఫ్రం హోం సర్వే, ఎమ్మెస్ సెమీ సర్వేలను పరిశీలించారు. సర్వేను పూర్తి చేయడానికి తగు సలహాలు, సూచనలు అందించారు. ఈ కార్యక్రమాలలో నగరపాలక అధికారులు పాల్గొన్నారు.

లైబ్రరీ సెస్ బకాయిలు వెంటనే చెల్లించాలి



అనూరాధకు సమస్యను వివరిస్తున్న గ్రంథాలయ సంస్థ ఉద్యోగులు

కడప కల్చరల్ : రాష్ట్ర వ్యాప్తంగా మునిసిపల్ కార్పొరేషన్లు , మునిసిపాలిటీలు రూ.266 కోట్ల లైబ్రరీ సెస్స్ బకాయిలను వెంటనే గ్రంథాలయాలకు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని గ్రంథాలయ ఉద్యోగుల రాష్ట్ర నేత నాదెండ్ల బాబ్జి ఆ శాఖ ఉన్నతాధికారులను కోరారు. శనివారం ఆయన మంగళగిరిలోని ప్రాపర్టీ టాక్స్ బోర్డు డైరెక్టర్ అఫ్ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ మెంబర్ సెక్రటరీ సి.అనురాధకు ఈ మేరకు వినతిపత్రాన్ని సమర్పించారు. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు లైబ్రరీ సెస్‌ను ఇంటి పన్నుతోనే కలిపి రాబడుతున్నారని, ఆ మొత్తాన్ని గ్రంథాలయ సంస్థలకు అందజేయడం లేదని తెలిపారు. సానుకూలంగా స్పందించిన మెంబర్ సెక్రటరీ అనూరాధ మాట్లాడుతూ ఈ సమస్యలను మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్‌కు వివరించి సమస్య పరిష్కారం కోసం చర్యలు చేపట్టగలమని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమలో గ్రంథాలయ సంస్థ రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ జి.కె.వర్మ ,అనంతపురం జిల్లా అధ్యక్షులు కె.జయరాం , కృష్ణా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి కృపానందం , చిన్న రాజ , చిత్తూరు జిల్లా అధ్యక్షులు టి.రవీంద్ర బాబు , అమరనాథ్ , మురళి తదితరులు పాల్గొన్నారు.

నగరంలో ర్యాలీ



కడప కోటిరెడ్డిసర్కిల్ : అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా శనివారం నుంచి ఈనెల 8వ తేదీ వరకు బేటీ బచావో–బేటీ పడావో నినాదంతో బైక్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక కలెక్టరేట్ ప్రాంగణంలోని డి–బ్లాక్ వద్ద జేసీ అదితి సింగ్ ఈ ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీ నగరంలోని ఎర్రముక్కపల్లి సర్కిల్, కోటిరెడ్డి సర్కిల్, ఆర్టీసీ బస్టాండ్ మీదుగా తిరిగి కలెక్టర్ ఆఫీసు వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి, డీఆర్‌డీఏ పీడీ ఆనంద్‌నాయక్, మెప్మా, వైద్య ఆరోగ్యశాఖ మహిళా సిబ్బంది, ఐసీడీఎస్ అధికారులు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పెద్దదర్గాలో ప్రార్థన



కడప కల్చరల్ : ప్రముఖ ఆధ్యాత్మిక సూఫీ క్షేత్రమైన అమీన్‌పీర్ (పెద్ద)దర్గాలో శనివారం సినీ హీరోయిన్ మెహరీన్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సహచరులతో కలిసి ఆమె దర్గాకు రాగానే దర్గా ప్రతినిధులు ఘనంగా స్వాగతం పలికారు. దర్గాలోని ప్రధానగురువుల మజార్ వద్ద తొలుత ప్రార్థనలు చేయించారు. అనంతరం ఆ ప్రాంగణంలోని ఇతర గురువుల మజార్లను కూడా దర్శింపజేసి ప్రార్థనలు చేయించారు. ఈ సందర్భంగా దర్గా విశిష్టతలు, చరిత్ర గురించి ఆమెకు వివరించారు. దర్గాను దర్శించుకోవడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని ఆమె మీడియాకు తెలిపారు.

జిల్లాపై వివక్ష చూపడం దారుణం



కోటిరెడ్డి సర్కిల్‌లో నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

కడప వైఎస్సార్ సర్కిల్: అసెంబ్లీలో కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన పూర్తిస్థాయి బడ్జెట్ 2025–26 కేటాయింపుల్లో కడప జిల్లా ప్రజల ఆకాంక్ష ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణానికి నిధులు కేటాయించకపోవడం, ప్రాజెక్టులకు నిధుల కేటాయింపులో కోతలు పెట్టడం కూటమి ప్రభుత్వ కక్ష సాధింపునకు పరాకాష్ట అని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. శనివారం రాష్ట్ర బడ్జెట్‌ను నిరసిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో నగరంలోని కోటిరెడ్డి సర్కిల్‌లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడ్జెట్లో కడప ఉక్కు ఫ్యాక్టరీ ఊసెత్తకపోవడం విచారకరమన్నారు. కరువు పీడిత రాయలసీమ నెల్లూరు ప్రకాశం జిల్లాల ప్రాజెక్టులైన గాలేరు నగరి, హంద్రీనీవా, తెలుగు గంగా, రాజోలి, వెలుగొండ ప్రాజెక్టులకు బడ్జెట్లో 10 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. అయితే రాష్ట్రంలో అన్ని ప్రాజెక్టులకు కలిపి కూడా 10 శాతం కేటాయించడం లేదంటే రాష్ట్రంలో రాయలసీమ ప్రాజెక్టులు ప్రాధాన్యత లేని ప్రాజెక్టుల జాబితాలో చేర్చినట్లు స్పష్టమవుతోందన్నారు. కడప బెంగుళూరు రైల్వే మార్గానికి అవసరమైన భూసేకరణకు నిధుల కేటాయింపు ప్రస్తావనే లేకపోవడం విచారకరమన్నారు. యోగి వేమన ఆర్కిటెక్చర్ యూనివర్సిటీలో అభివృద్ధికి, మెడికల్ కాలేజీకి నిధులు కేటాయించకపోవడం విచారకరమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి ఎస్ వెంకట శివ, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎల్ నాగ సుబ్బారెడ్డి, ఎంపీ సుబ్బారెడ్డి, విజయలక్ష్మి, వేణుగోపాల్, బాదుల్లా, సుబ్రమణ్యం, డబ్ల్యూ రాము, సిఆర్వి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో జిల్లాకు అన్యాయం

కడప వైఎస్సార్ సర్కిల్: ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ లో జిల్లా కు తీవ్ర అన్యాయం జరిగిందని, ముఖ్యంగా యువతకు భరోసా లేదని సూపర్ సిక్స్ లో భాగమైన నిరుద్యోగ భృతి లేదని, ఎన్నికల హామీలలో వాలంటీర్లకు ఇచ్చిన హామీ లేదని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ తెలిపారు. శనివారం నగరంలోని డీవైఎఫ్ఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా ప్రజలు రాష్ట్ర బడ్జెట్ పై ఎన్నో ఆశలు పెట్టుకున్నారని తీరా బడ్జెట్ చూస్తే ఆశలపై నీళ్లు చల్లినట్టు అయిందన్నారు. కడప ఉక్కుకు నిధులు కేటాయించకపోవడం దారుణమన్నారు. ఈ సమావేశంలో డీవైఎఫ్ఐ నగర అధ్యక్ష కార్యదర్శులు నరసింహ విజయ్ పాల్గొన్నారు.

అంకెల గారడీలా ఉంది

కడప కార్పొరేషన్: కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2025–26 బడ్జెట్లో ముస్లిం, మైనార్టీలకు తీవ్ర అన్యాయం జరిగిందని వైఎస్సార్‌సీపీ కడప అసెంబ్లీ నియోజకవర్గ మైనార్టీ అధ్యక్షుడు ఎస్ఎండీ షఫీ అన్నారు. శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మైనార్టీ సంక్షేమానికి రూ.5400 కోట్లు పెట్టారు. ఇది కేవలం అంకెల గారడీ మాత్రమేనని, మసిపూసి మారేడు కాయ చేసేలా ఈ బడ్జెట్ ప్రవేశపెట్టారన్నారు. హజ్ యాత్రికులకు సాయం చేయడానికి ఎంత వినియోగిస్తారు. ఇమామ్‌లు, మౌజన్ల గౌరవ వేతనాలకు ఎంత అనేది తెలుపలేదన్నారు. ఈ బడ్జెట్ ముస్లిం, మైనార్టీలను దగా చేసేదిగా ఉందని తెలిపారు.

జనాభా ప్రాతిపదికన బడ్జెట్ కేటాయించాలి



బడ్జెట్ ప్రతులను దగ్ధం చేస్తున్న ఆప్‌కీ ఆవాజ్ నాయకులు

కడప వైఎస్సార్ సర్కిల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ లో మైనార్టీలకు కేటాయించిన బడ్జెట్ దేనికీ పనికిరాదని, జనాభా ప్రాతిపదికన బడ్జెట్‌ను కేటాయించాలని ఆప్ కి ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి షేక్ మక్బూల్ బాషా పేర్కొన్నారు. శనివారం నగరంలోని ఆప్‌కీ ఆవాజ్ రాష్ట్ర కార్యాలయం ఎదుట బడ్జెట్ కాపీలను దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రంగాలలో వెనుకబడిన మైనార్టీలకు రాష్ట్ర ప్రభుత్వం కంటి తుడుపు బడ్జెట్ కేటాయించిందని ఆవేదన చెందారు. ఇది ఎంత మాత్రం సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో ఆప్ కి ఆవాజ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ చాన్ బాష, స్థానిక నాయకులు షబ్బీర్, జిలాన్ తదితరులు పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న రైతు సంఘం జాతీయ సమితి సభ్యులు చంద్ర

కడప వైఎస్సార్ సర్కిల్: ఏప్రిల్ 15, 16, 17 తేదీల్లో తమిళనాడు రాష్ట్రం నాగపట్నం నగరంలో జరిగే ఏఐకెఎస్ జాతీయ మహా సభలను జయప్రదం చేయాలని రైతు సంఘం జాతీయ సమితి సభ్యులు గాలి చంద్ర పేర్కొన్నారు. శనివారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏపీ రైతు సంఘం జిల్లా సమితి సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి నిర్వహించనున్న జాతీయ మహాసభలు ప్రత్యేకతతో కూడుకున్నవన్నారు. ఈ మహాసభలలో దేశవ్యాప్తంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ముఖ్యంగా మద్దతు ధర, స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల అమలు, రైతాంగ వ్యతిరేక మూడు నల్ల చట్టాలు రద్దు, దేశవ్యాప్త రైతుల రుణ మాఫీ, పీఎం కిసాన్ నిధుల పెంపు తదితర రైతులకు ప్రయోజనం చేకూర్చే ప్రధాన అంశాలపై చర్చించి, భవిష్యత్తు ఉద్యమ కార్యచరణ రూపొందిస్తామన్నారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పోతిరెడ్డి భాస్కర్, జిల్లా అధ్యక్షుడు ఎంవి సుబ్బారెడ్డి, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు టి . మనోహర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు పెద్ద పుల్లయ్య, టి. రామ్మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సైన్స్‌పై మక్కువ పెంచుకోవాలి

కడప ఎడ్యుకేషన్: విద్యార్థి దశ నుంచే సైన్సుపై మక్కువ పెంచుకోవాలని నారాయణ స్కూల్ ఏజీఎం చెన్నకేశవరాజు పేర్కొన్నారు. కడప బిల్టప్ సర్కిల్‌లోని నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో శనివారం సైన్సుఫేర్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్సు ప్రాజెక్టుల ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రామకృష్ణశర్మ, ప్రిన్సిపాల్ కల్పన, వైస్ ప్రిన్సిపాల్ మల్లీశ్వరి, ఏడీ తాజుద్దీన్, కో ఆర్డినేటర్స్ పాల్గొన్నారు.

రంజాన్ కిట్ల పంపిణీ

కడప కోటిరెడ్డిసర్కిల్ : రంజాన్ మాస ప్రారంభాన్ని పురస్కరించుకుని శనివారం కడప నగరంలోని బీజేపీ కార్యాలయంలో బీజేపీ మైనార్టీ మోర్చా నాయకులు నూరుద్దీన్, ఇలియాస్ షేక్ ఆధ్వర్యంలో రంజాన్ కిట్లను పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు జంగిటి సుబ్బారెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లక్ష్మినారాయణ, బీజేవైఎం జాతీయ నాయకులు బత్తల పవన్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు ప్రవీణ్‌నాయుడు, ప్రధాన కార్యదర్శి సురేంద్ర, జిల్లా అధికార ప్రతినిధి చలపతి, నాయకులు కిరణ్, షకీలాబేగం పాల్గొన్నారు.

ఘనంగా ప్రారంభమైన గంగమ్మ జాతర



పూజలందుకున్న గంగమ్మ తల్లి



విద్యుత్ కాంతులతో గంగమ్మ ఆలయం

కడప వైఎస్సార్ సర్కిల్/చింతకొమ్మదిన్నె : కొత్తపేట గ్రామంలో వెలసిన గంగమ్మతల్లి జాతర మొదటి రోజు శనివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. అనంతరం బండలాగుడు పోటీలను నిర్వహించారు. ఆరు జతల ఎడ్లు పాల్గొనగా మొదటి బహుమతి గుంటూరు జిలపల్లి గ్రామానికి చెందిన రిసిగ్నితారెడ్డి ఎద్దులు రూ. 80 వేలు, రెండవది ప్రొద్దుటూరుకు చెందిన ద్వార్సల గురువిరెడ్డి ఎద్దులు రూ.60 వేలు, మూడవది ప్రొద్దుటూరు మండలం చౌటపల్లి గ్రామానికి చెందిన మార్త చంద్రఓబుల్‌రెడ్డి ఎద్దులు రూ.40 వేలు, నాల్గవది వల్లూరు మండలం గాలివారిపల్లెకు చెందిన ఇందిరెడ్డి రమణారెడ్డి ఎద్దులు రూ.30 వేలు గెలుచుకున్నాయి. ఐదవది కమలాపురానికి చెందిన కుమార్ ఎద్దులు రూ.20 వేలు, ఆరవది ప్రొద్దుటూరు మండలం కామనూరు గ్రామానికి చెందిన శివకాంత్‌రెడ్డి ఎద్దులు రూ.10 వేలు గెలుచుకున్నాయి. వీరికి ఆలయ ఈవో కృష్ణానాయక్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు బహుమతులను అందజేశారు. అలాగే పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

నేడు తిరుణాల

రెండు రోజుల జాతరలో భాగంగా ఆదివారం తిరుణాల ఘనంగా జరగనుంది. సీకేదిన్నె సీఐ శివశంకర్ నాయక్, ఎస్ఐ శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తును ఏర్పాటు చేశారు.



బండలాగుతున్న ఎడ్లు

మోడల్ గ్రామంగా కీర్తిపల్లె ఎంపిక



కీర్తిపల్లెలో పర్యటిస్తున్న జిల్లా అధికారులు

వీరపునాయునిపల్లె : మండలంలోని కీర్తిపల్లె మోడల్ గ్రామంగా ఎంపికైంది. శనివారం జిల్లా స్థాయి అధికారులు కీర్తిపల్లెలో పర్యటించారు. జిల్లా వ్యవసాయ అధికారి అయిత నాగేశ్వర్‌రావు విలేకరులతో మాట్లాడుతూ గ్రామంలోని రైతుల ఆదాయం రెట్టింపు చేసే విధంగా గ్రామాన్ని తీర్చిదిద్దేందుకు కలెక్టర్ కీర్తిపల్లెను మోడల్ గ్రామంగా ఎంపిక చేశారన్నారు. కార్యక్రమంలో డ్వామా పీడీ, పశు సంవర్థక శాఖ అధికారి శారదమ్మ, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సుభాషిణి, ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ ప్రవీణ్, మార్క్ఫెడ్ మేనేజర్ జిల్లా సూక్ష్మ నీటిపారుదల అధికారి చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా మత్స్య శాఖ అధికారి, జిల్లా కో ఆపరేటివ్ అధికారి, జిల్లా పట్టు పరిశ్రమ అధికారులు, మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబు, రైతులు పాల్గొనారు.

నగర శివార్లలో వండర్ లా ప్రారంభం



వండర్ లా లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగర శివార్లలోని కమలాపురం రోడ్డులోగల సత్యాగ్రీన్ సిటీ రోడ్డులో ఏర్పాటు చేసిన కడప వండర్ లా ను కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డిలు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సుమారు రూ. 8 కోట్లతో ఈ వండర్ లా ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రజలను ఆకట్టుకునే అనేక అంశాలు ఇందులో ఉన్నాయన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న సినీ హీరోయిన్లు నిధి అగర్వాల్, మెహరీన్‌లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

శివరాత్రి ఉత్సవాల ఆదాయం రూ.16 లక్షలు

రాజంపేట రూరల్: మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా కామాక్షి సమేత త్రేతేశ్వర స్వామికి హుండీ, టికెట్లు, విరాళాల రూపంలో రూ.16,77,162 ఆదాయం వచ్చిందని జిల్లా దేవదాయశాఖ అధికారి సి.విశ్వనాథ్, ఈవో గంగవరం కొండారెడ్డి తెలిపారు. ఆలయంలో హుండీ ఆదాయాన్ని శనివారం లెక్కించారు. వారు మాట్లాడుతూ టెంకాయల విక్రయ వేలం ద్వారా రూ.7,10,000, స్వామి హుండీ ద్వారా రూ.5,86,229, దర్శన టికెట్ల నుంచి రూ.3,50,600ల ఆదాయం వచ్చిందన్నారు. త్రేతేశ్వరస్వామి కల్యాణానికి భక్తుల చదివింపుల రూపంలో రూ.30,333 అందజేశారన్నారు. కార్యక్రమంలో రాంప్రసాద్‌రెడ్డి, కె. పద్మనాభ శాస్త్రి, పోలి సుధీష్ రెడ్డి, లక్ష్మయ్య, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధాన్ని కచ్చితంగా అమలు చేయాలి

కమలాపురం : ప్లాస్టిక్ నిషేధాన్ని కచ్చితంగా అమలు చేయాలని మున్సిపల్ కమిషనర్ పగడాల జగన్నాథ్ తెలిపారు. శనివారం ఆయన పట్టణంలోని పలు దుకాణాలను తనిఖీలు చేశారు. పట్టణ ప్రజలు, వ్యాపారులు, వినియోగదారులు కచ్చితంగా ప్లాస్టిక్ నిషేధాన్ని అమలు చేయాలన్నారు. ప్లాస్టిక్ ప్లేట్లు, కవర్లు, కప్పులు తదితరవి వాడకుండా వాటి స్థానంలో పేపర్ ప్లేట్లు, గ్లాసులు, కప్పులు వాడాలన్నారు. ప్రజలు సహకరిస్తేనే ప్లాస్టిక్ నిషేధాన్ని పూర్తి స్థాయిలో అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



క్రీడా జ్యోతిని వెలిగిస్తున్న నగరపాలక కమిషనర్ మనోజ్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్: క్రీడలతో విద్యార్థులకు మానసికోల్లాసంతోపాటు శారీరక దృఢత్వం ఏర్పడుతుందని కడప నగరపాలక కమిషనర్ మనోజ్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం కడపలోని శ్రీ చైతన్య విద్యాసంస్థల్లో ఏజీఎం దేరంగుల రమణయ్య పర్యవేక్షణలో డాక్టర్ బిఎస్‌రావు మెమోరియల్ క్రీడా పోటీలను నిర్వహించారు. సంబంధిత క్రీడలను కమిషనర్ మనోజ్‌రెడ్డి, సికెదిన్నె సీఐ శివశంకర్‌నాయక్‌లు ఏజీఎం దేరంగుల రమణయ్యతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు చాలా ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు, ప్రిన్సిపాల్స్, కో ఆర్డినేటర్లు, డీన్‌లు, ఇన్‌చార్జులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ ఓబులేసు

కడప ఎడ్యుకేషన్: విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన పెంచుకోవాలలని చిన్నచౌకు సీఐ ఓబులేసు తెలిపారు. మార్చి 8వ తేదీ అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కడప చిన్నచౌకు పోలీసుస్టేషన్‌లో విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోలీసు స్టేషన్‌లో పోలీసుల విధులు, ఉపయోగించే రికార్డులతోపాటు వారు వినియోగించే వస్తువుల గురించి వివరించారు. అలాగే మహిళా చట్టాలు, పోక్సోయాక్ట్, ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, గుడ్ అండ్ బ్యాడ్ టచ్, సైబర్‌క్రైమ్‌పై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. దీంతోపాటు హెల్ప్‌లైన్ నెంబర్స్ 1098, 181, 100, 112, 1930 గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు రవికుమార్, రాజరాజేశ్వరరెడ్డిలు పాల్గొన్నారు.

ఘన సన్మానం



రిటైర్డ్ జేడీ లక్ష్మినారాయణను సత్కరిస్తున్న బ్రౌన్ సిబ్బంది

కడప కల్చరల్ : కడప నగరంలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రాన్ని శనివారం సీబీఐ రిటైర్డ్ జాయింట్ డైరెక్టర్ లక్ష్మినారాయణ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఈ గ్రంథాలయాన్ని ఇంతకుముందు కూడా సందర్శించానని, మరోసారి అవకాశం రావడం సంతోషంగా ఉందన్నారు. గ్రంథాలయంలోని ఆంధ్రప్రదేశ్ స్వాతంత్య్ర సమరయోధులు అనే పుస్తకంలోని వ్యక్తుల గురించి జిల్లాలవారీగా పుస్తకాలు అచ్చువేయించాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ సిబ్బంది ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డా. భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి, డాక్టర్ చింతకుంట శివారెడ్డి, గ్రంథాలయ సహాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదవాలి



మాట్లాడుతున్న ఏవీఆర్ విద్యాసంస్థల చైర్మన్ వెంకటేశ్వర్లు

కడప ఎడ్యుకేషన్: విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని మంచి ఉత్తీర్ణతను సాధించాలని ఏవీఆర్ విద్యాసంస్థల చైర్మెన్ వెంకటేశ్వర్లు సూచించారు. శనివారం కడప ఎన్‌జీవో కాలనీలోని గురుకుల్ విద్యాపీఠ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో ఫేర్‌వెల్ సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని అటు పాఠశాలకు ఇటు తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలన్నారు. అనంతరం 9వ తరగతి విద్యార్థులు పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ వీరకుమారి, ఏవీఆర్ సీఈఓ వివేకానంద, పల్లవి, ప్రిన్సిపాల్ మునిచంద్ర, వైస్ ప్రిన్సిపాల్ నరసింహులు పాల్గొన్నారు.